ఘనంగా నల్లపోచమ్మ బోనాలు



ఆలయంలో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: పట్టణంలోని కిందిబస్తీ నల్ల పోచమ్మ బోనాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అలాగే ఫలహార బండ్ల ఊరేగింపు, పోతురాజుల నృత్యాలు, శివ సత్తుల శిగాలు, నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలి

కీసర: కీసరలోని సర్వే నంబర్ 9లో గల ముదిరాజుల శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురైందని సదరు స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ కీసరకు చెందిన ముదిరాజ్ సంక్షేమ సంఘం సభ్యులు కీసర తహసీల్దార్ అశోక్ కుమార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి పూర్తి వివరాలు సేకరించాలని ఆర్‌ఐకి ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. ఆనబోయిన జంగయ్య, శ్రీనివాస్, రమేశ్, జగదీశ్, రాజలింగం, గంగారాం, రాజు, శ్రీరంగం, రాములు, మహేందర్, రాగుల రమేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యం

శామీర్‌పేట్: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక సంఘం టీఎస్ యూటీఎఫ్ అని సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ శామీర్‌పేట మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల త్వరలో దశలవారీగా పోరాట కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు తిరుమలేశ్, మండల ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



అందజేస్తున్న 108 ఉద్యోగులు

మేడ్చల్: 108లో జిల్లా ఇన్‌చార్జిగా పని చేస్తున్న అవుదాపురం విజయేందర్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో జిల్లా 108 సర్వీసెస్ ఉద్యోగులు కలిసి బాధిత కుటుంబానికి గురువారం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా 108 ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగేందర్, కో ఆర్డినేటర్ తిరుపతి, జిల్లాలోని 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైడ్రా కృషి

గౌతంనగర్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తుందని హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదిత్య అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో గల సర్వే నంబర్ 868 లోని ప్రభుత్వ స్థలంలో స్థానికుల ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాం, హైడ్రా తహసీల్దార్ హేమమాలినితో కలిపి గురువారం బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ సుమారు 3 వేల గజాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. దానిలో కొంతకాలంగా ఇండ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ చేస్తూ వ్యర్థాలను వేరు చేస్తున్నారని దాంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీవాసులు కరుణాకర్‌తోపాటు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రాతో పాటు మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాంకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు వ్యర్థాల డంపింగ్‌ను అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటయ్య, అత్యుతరావు, గోపాల్‌రెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మేడిపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చౌడూరు గ్రామానికి చెందిన పెనుమల శ్రీనివాస్ (45) బోడుప్పల్ ఆర్ఎన్ఎస్ కాలనీలో నివాసముంటూ..స్థానికంగా ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. సమస్యలు తీవ్రం కావడంతో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం గదిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరక మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటు శిథిలం.. ఇటు సమస్యలు..!



శిథిలావస్థలో చీర్యాల జేఎన్ఎంయూఆర్ కాలనీ గృహ సముదాయాలు

జేఎన్ఎంయూఆర్ కాలనీ గృహ సముదాయాల్లో కనీస సౌకర్యాలు కరువు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కీసర: జేఎన్ఎంయూఆర్ కాలనీ గృహ సముదాయాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఓ వైపు భవనాలు శిథిలావస్థకు చేరుకోగా మరోవైపు కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్ల క్రితం నిరుపేదలకు సొంతింటి కలనే నెరవేర్చేందుకు జేఎన్ఎంయూఆర్ కాలనీల



నీళ్ల కోసం డ్రమ్ములు పెట్టిన దృశ్యం

పేరిట చీర్యాల, రాంపల్లి దాయర గ్రామాల రెవెన్యూ పరిధిలో జీ+2 విధానంలో ఒక్కో బ్లాక్‌లో 24 గృహాల చొప్పున సుమారు 29 బ్లాక్‌లు మొత్తం 696 గృహ సముదాయాలను రెండు చోట్ల నిర్మించి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు అందజేసింది.అప్పట్లో తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, రవాణ మార్గం, తదితర సౌకర్యాలు అరకొరగా కల్పించారు. దీంతో కొన్నేళ్లలోనే డ్రైనేజీ వ్యవస్థ పాడవ్వడం, తాగు నీటి ట్యాంకులు లీకవ్వడం, గృహ సముదాయాలు సైతం శిథిలావస్థలో కన్పిస్తున్నాయి. అయినా అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చీర్యాల జేఎన్ఎంయూఆర్ కాలనీ సముదాయాల వద్ద నివసిస్తున్న ప్రజలు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వల్ల ఇప్పటికే పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిత్యం జీహెచ్ఎంసీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటి కోసం ఇండ్ల ముందు డ్రమ్ములు పెట్టుకొని నింపుకున్న తరువాత బకెట్లతో రెండంతస్తుల పైకి తీసుకుపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. ఇక రాంపల్లి దాయర పరిధిలో గల జేఎన్ఎంయూఆర్ కాలనీ గృహసముదాయాలకు కూడా మరమ్మతులు చేపట్టి, డ్రైనేజీ తాగునీటి సరఫరా, కాలనీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని వారు విన్నవిస్తున్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో జీ+10 విధానంలో 6,240, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో సుమారు 6,200 వరకు నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల సముదాయాల వద్ద సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



చీర్యాల జేఎన్ఎంయూఆర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి పాలకులు, అధికారులు చొరవ చూపాలి. గృహ సముదాయాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఇక్కడి సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లాం.

–జిల్లాల తిరుమల్‌రెడ్డి, బీజేపీ నేత, చీర్యాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



చీర్యాల జేఎన్ఎంయూఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపడుతాం. గృహసముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు అవసరమయ్యే నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–వెంకట్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి
- మహిళా సంఘాలకు చెక్కుల అందజేత



మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులనే చేయడమే రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని శుభం ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని 5 మండల సమాఖ్యలు, 118 గ్రామ సమాఖ్యాల్లో ఉన్న 3495 ఎస్‌హెచ్‌జీల్లో 39,642 మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా అవసరమైన ఆర్థిక సహకారం, వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని తెలిపారు. 2024–25లో 2,794 సంఘాలకు రూ. 220 కోట్ల 68 లక్షలు విడుదల చేశామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై నాటికి 619 సంఘాలకు రూ. 39 కోట్ల రుణాలు అందిస్తామని చెప్పారు. జిల్లాలోని 89 వేల మంది విద్యార్థులకు రూ. 14 కోట్లతో మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫారాలు కుట్టించామన్నారు. అనంతరం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ .. మహిళలు వారి ఇంట్లో బాధ్యతలు నెరవేరుస్తూనే సమాజంలో రాణిస్తూ రోల్ మోడల్ గా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికగుప్తా, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్, హజ్ కమిటీ మెంబర్ ముజీబ్, మాజీ మేయర్ కావ్య, దమ్మాయిగూడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత, శ్రీకాంత్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రసవాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: హైరిస్క్ ప్రసవాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి సూచించారు. మేడ్చల్ కలెక్టరేట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారులకు గురువారం ప్రత్యేకంగా ఒక రోజు ×దక్షత శిక్షణా శిబిరం℥ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులు సురక్షిత ప్రసవాలు, శిశువుల తక్షణ సంరక్షణ, తల్లీబిడ్డ ప్రసవానంతర తీసుకోవాల్సిన శ్రద్ధ, కుటుంబ నియంత్రణ పద్ధతులు, సంక్రమణ నివారణ పద్ధతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ వంటి కీలక అంశాలను వివరించారు.శిక్షణ ద్వారా నైపుణ్యాలు మెరుగవడంతో పాటు, ప్రామాణిక మార్గదర్శకాలకు అనుగుణంగా క్లినికల్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.గర్భిణులకు గౌరవంగా, భద్రతగా సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సేవాల్లో ప్రతిబింబింపజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు శోభారాణి, సత్యవతి ప్రోగ్రాం అధికారులు గీత చంద్రకళ, వివిధ అధికారులు పాల్గొన్నారు.

అంతరిక్షంపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

మేడ్చల్: విద్యార్థులు అంతరిక్షంపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్సీ) స్టూడెంట్ అండ్ పబ్లిక్ ఔటరిచ్ హెడ్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని న్యూలిటిల్ లిల్లి స్కూల్‌లో ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'స్పేస్ ఆన్ వీల్' లో పాల్గొని ప్రసంగించారు. అంతరిక్షం విషయంలో దేశం ఎంతో పురోగతి సాధించిందని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై ప్రపంచ స్థాయిలో పట్టు సాధించిందన్నారు. విద్యార్థులు అంతరిక్షంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏంఈఓ శంకరయ్య, పాఠశాల ప్రతినిధులు మంజుల ప్రకాశ్, సాయిదీప్, మౌనిక, శాంతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంటకు చెందిన మేకల రాములు (55) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం నాచారంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై చేగుంటకు వెళ్తుండగా మార్గమధ్యంలోని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి చెక్‌పోస్ట్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రాములు కింద పడిపోగా అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ వాహనం అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

శామీర్‌పేట్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లింగాపూర్ తండాకు చెందిన దానవత్ నవీన్ (23) స్నేహితులతో కలిసి ఉద్దెమర్రి చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అందరు కలిసి ఒడ్డుకు చేరుకోగా నవీన్ తిరిగి చెరువు వద్దకు వెళ్లాడు. నీటిలో దిగిన అతడు స్నేహితులు చూస్తుండగానే మునిగిపోయాడు. ఒడ్డుకు తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా నవీన్ మూర్ఛ వ్యాధితో మృతి చెందడా..? మరేదైనా కారణమా..? అనేది తేలాల్సి ఉంది. మృతుడికి భార్య, కూతురు ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

శామీర్‌పేట్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ జైపాల్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయాంజాల్, సింగాయిపల్లిలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతితో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, హౌసింగ్ ఏఈ కమలాకర్, వార్డు ఆఫీసర్లు పురుషోత్తం, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

రామంతాపూర్ : చిన్న చెరువు ప్రాంగణంలోని గంగా లక్ష్మీ భవానీ ఆలయం 13వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు ఢీటి మల్లయ్య, పూస సత్తయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే, మేడ్చల్, ముషీరాబాద్ బండారి లక్ష్మారెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

కొనసాగుతున్న '100 రోజుల ప్రణాళిక'



మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి పుష్పలత, కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: '100 రోజుల ప్రణాళిక'లో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఇంటింటికీ మొక్కల పంపిణీ చేపడుతామని మున్సిపల్ ప్రత్యేకాధికారి ఆర్. పుష్పలత అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు, ఇంటింటికీ పొడి, తడి వ్యర్థాల వేరు చేయడం, గృహ కంపోస్టింగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన, సింగిల్–యూజ్ ప్లాస్టిక్ నివారణ తదితర అంశాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. కాలనీలో 2550 పూలు, పండ్ల మొక్కల పంపిణీ చేయడంతో పాటు, ఆర్‌జీకే కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ బాల మురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, కార్యాలయ సిబ్బంది, స్నేహ మహిళా సంఘం మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఘట్‌కేసర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు చింతల యాదయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం నెల నెల జీతాలు, బిల్లులు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అలాగే కార్మికులపై హెచ్ఎంల వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే శనివారం ఎంఈఓలకు వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో బిల్లులు ఇవ్వకుంటే ఎంఈఓ కార్యాలయాల ఎదుట దీక్షలు చేసేందుకు వెనకాడొద్దని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పుష్ప, వరలక్ష్మి, కవిత, రాజాచారి, విజయలక్ష్మి, భాగ్య, జ్యోతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ భద్రత, నేరాల నియంత్రణపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. అంతర్జాతీయ సైబర్ నేర శిక్షకుడు అఖిలేశ్‌రావు పాల్గొని సైబర్ ప్రపంచంలో ఉద్భవిస్తున్న ధోరణులు, సవాళ్లు, నివారణ వ్యూహాలపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ప్రపంచ సైబర్ బెదిరింపులు, హ్యాకింగ్, సాంకేతికతలో నైతిక పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసరకు చెందిన యాకరి అనితకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ 23,500 ఆర్థిక సాయం చెక్కును గురువారం లబ్ధిదారు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కీసర బీఆర్ఎస్ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయాంజాల్‌కు చెందిన జ్యోతికి రూ.45 వేలు, ఉమాకు రూ.28,500, పోతాయిపల్లికి చెందిన మంజులకు రూ.45, 500 చొప్పున ఆర్థిక సాయం మంజూరు కాగా సంబంధిత చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరయాంజాల్ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు హరిగోపాల్, హరికృష్ణ, మాజీ ఉప సర్పంచ్ లు తిరుపతి, శంకర్ గౌడ్, దేవరశెట్టి రాజు, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు



గణేశ్ (ఫైల్)

శామీర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో విద్యుత్ కార్మికుడి మృతి చెందిన ఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ నియోజకవర్గం బంగ్ల వెంకటాపూర్ గ్రామానికి చెందిన గణేశ్ (24), కొంతకాలంగా అలియాబాద్ మున్సిపాలిటీ, తుర్కపల్లి లైన్‌మెన్ వద్ద సహాయకుడిగా పని చేస్తున్నాడు. కాగా గురువారం తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీలో విద్యుత్ మరమ్మతులు చేసేందుకు లైన్‌మెన్ గణేశ్ తీసుకెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ గణేశ్ తీవ్రంగా గాయపడగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో సుమారు 3 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు వచ్చి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగచంద్ర రెసిడెన్సీ వాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బండి గార్డెన్ ఎదుట నాగచంద్ర రెసిడెన్సీ అపార్టుమెంట్‌వాసులు సదరు బిల్డర్ తీరును నిరసిస్తూ మేడిపల్లి పోలీస్‌స్టేషన్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సువిని ఇన్‌ఫ్రా పేరుతో 5 అంతస్తులతో 30 ఫ్లాట్లుగా బిల్డర్ నిర్మాణం చేపట్టాడరన్నారు. మూడేళ్లుగా అంపూర్తిగా నిర్మాణం చేపట్టి తమను మోసం చేశాడని వాపోయారు. లిఫ్ట్ పనులు చేయలేదని, గ్రిల్స్ లేకపోవడంతో ప్రతిరోజు పెద్దలు, పిల్లలు, వృద్ధులు 5 ఫ్లోర్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిగిలిన పనులు చేయాలని బిల్డర్‌ను పలుమార్లు కోరగా తనకు ప్రభుత్వ పెద్ద అండదండలు ఉన్నాయని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మరోవైపు అపార్ట్‌మెంట్ ఎదురుగా 15 ఫీట్ల రోడ్డును ఆక్రమించి మరో నిర్మాణం చేపట్టడంతో పాటు పార్కింగ్‌కు వదిలిన స్థలంలో జిప్టో కార్యకలాపాలు సాగిస్తున్నాడని తక్షణమే స్పందించి అసంపూర్తి పనులు చేయించాలని లేకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పూర్ణిమ, సంధ్య, నాగేశ్వర్ రావు, సురేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, కార్తీక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.